క్లుప్తంగా

ఖరీఫ్ సాగుకు రైతాంగం సన్నద్ధం


మల్లవరంలో దుక్కి దున్నుతున్న రైతు

మునగపాక : ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచారు. వర్షాలు అనుకూలించడంతో రైతులు దుక్కి దున్నుతున్నారు. మెట్ట, మైదాన ప్రాంతాల్లో వరిసాగుకు అవసరమయ్యే చర్యలు ప్రారంభమయ్యాయి. సీజన్‌కు ముందే ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి రావడంతో పలు చోట్ల సాగు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఖరీఫ్ వరి సాగు మండల వ్యాప్తంగా 2400 ఎకరాలు కాగా పూర్తిస్థాయిలో సాగు జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

చేతిబోరుకు మరమ్మతు


నీలిగుంటలో చేతిబోరుకు మరమ్మతు చేస్తున్న మండల పరిషత్ సిబ్బంది

కోటవురట్ల : వేసవితో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. చేతిబోర్లు ఒక్కొక్కటిగా మొరాయిస్తున్నాయి. నీలిగుంటలో చేతిబోరు పని చేయక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్య తెలుసుకున్న సర్పంచ్ వరహాలబాబు మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వెంటనే ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తీసుకున్న చర్యలతో సిబ్బంది శనివారం చేతి బోరుకు మరమ్మతు చేశారు.

తురాయి సోయగం



కె.కోటపాడు: గుల్లేపల్లి–చింతపాలెం మార్గంలో తురాయి చెట్ల పూలు ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా నాటిన తురాయి చెట్లు వేసవిలో చల్లని నీడతో వాహనదారులను ఆహ్లాదపరుస్తున్నాయి. ఈ చెట్లు నుంచి పూసిన ఎరుపు రంగు పూలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం


రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం వైభవంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక పెద్దమిల్లు జంక్షన్‌లో వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతోపాటు స్వయంభూ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకుడు దొరబాబుశర్మ పాల్గొన్నారు.

ప్రదక్షిణ మార్గంలో షెడ్ ఏర్పాటు



కశింకోట : స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ప్రదక్షిణ మార్గం చుట్టూ ఎండా వానల నుంచి రక్షణ కోసం షెడ్ నిర్మించారు. భక్తులు, దాతల సహకారంతో దీనిని సమకూర్చారు. ధ్యాన వేంకటేశ్వరస్వామిని శనివారం అందంగా వజ్ర కవచం, పూల మాలలు, తులసి మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

అభివృద్ధిలో.. నూతన ఒరవడి


సుందరంగా తీర్చిదిద్దిన సంపద తయారీ కేంద్రం


రూ.35 లక్షలతో నిర్మించిన మునగపాక దళితవాడకు వెళ్లే రోడ్డు

- కోట్లాది రూపాయలతో మునగపాకకు కొత్త హంగులు
- మారుతున్న రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు


మునగపాకలో రూ.48 లక్షలతో నిర్మించిన బైపాస్ రోడ్డు

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాక అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. గతంలో అభివృద్ధికి నోచుకోని ఈ గ్రామం నేడు ప్రజలకు చక్కటి సదుపాయాలు కల్పిస్తూ దూసుకుపోతోంది. దీంతో పంచాయతీ పాలకవర్గం అందరి మన్ననలు అందుకుంటోంది. గ్రామంలో జరిగిన అభివృద్ధి పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- మునగపాక నుంచి తోటాడ, పాటిపల్లి, నాగవరం, వాడ్రాపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడేవారు. దీంతో రూ.48లక్షల వీఏంఆర్‌డీపే నిధులతో మునగపాక బైపాస్ రోడ్డు నిర్మించారు.
- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గాను రూ.48 లక్షలతో సచివాలయం నిర్మించారు. ఈ సచివాలయం ద్వారా పలు రకాల సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పలు శాఖలకు సంబంధించిన అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమయ్యే సేవలందిస్తున్నారు.
- మునగపాకలో రూ.12 లక్షలతో సంపద తయారీ కేంద్రం నిర్మించారు. ఈ కేంద్రం ద్వారా సంపద సేకరించి రైతులకు అవసరమయ్యే ఎరువులను విక్రయిస్తున్నారు. గ్రామంలో తడిపొడి చెత్త సేకరణ ద్వారా సంపద తయారీ కేంద్రానికి అదనపు ఆదాయం సమకూరుతోంది. ఇటీవల ఢిల్లీకి చెందిన బృందం ఈ కేంద్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసింది
- మునగపాకలోని దళితవాడకు వెళ్లే రోడ్డు చిన్నదిగా ఉండడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడేవారు. పంచాయతీ సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రత్యేక కృషి కారణంగా రూ.35 లక్షలతో దళిత వాడకు వెళ్లే రోడ్డు నిర్మించారు. దీంతో కాలనీవాసుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.
- గ్రామంలో పలు చోట్ల అంతర్గత రహదారులు.. అలాగే బీసీ కాలనీలో ఇటీవల రెండు చోట్ల డ్రైనేజీ కాలువలు నిర్మించారు. అలాగే అవసరం మేర కల్వర్టులు నిర్మించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చక్కటి అభివృద్ధి జరుగుతోంది..



మునగపాక చక్కగా అభివృద్ధి చెందుతోంది. రహదారులు, కాలువలతో పాటు గ్రామ రూపురేఖలు మారిపోయాయి. గతంలో ఉన్న మునగపాకకు నేటి మునగపాకకు వ్యత్యాసం కనిపిస్తోంది. పంచాయతీ పాలకవర్గం గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయం.

– రాజాన బుజ్జి, అంబేడ్కర్ జిమ్, పునాది అసోసియేషన్ కన్వీనర్

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి..



మునగపాక గ్రామాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలకు పంచాయతీ పాలకవర్గం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నాం. గ్రామంలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రజలకు అవసరమయ్యే కనీస సదుపాయాలు అందుబాటులోకి తీసుకు వస్తున్నాం.

– దిమ్మల అప్పారావు, సర్పంచ్, మునగపాక

‘కులమతాలకు అతీతంగా మెలగాలి’


రామారాయుడుపేటలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఏఎస్ఐ రామకృష్ణ

మునగపాక : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా మెలగాలని ఏఎస్ఐ రామకృష్ణ కోరారు. సంఘ బహిష్కరణలకు అవకాశం లేకుండా అన్ని కులాల వారు సమన్వయంతో ఉండాలన్నారు. కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చిన కథనాలకు స్పందించిన పోలీసులు శనివారం సంబంధిత గ్రామానికి చేరుకుని ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ కుటుంబాల మధ్య ఉన్న విభేదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. అంతేగాని పత్రికలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. కుల,మతాలకు తావు లేకుండా కలిసి మెలిసి ఉండాలని చెప్పారు. తెలిసీ తెలియని జ్ఞానంతో కులపెద్దలపై కుందిరి దేముడు కుటుంబ సభ్యులు లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు రాము, రాజు, నాగేశ్వరరావు, నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గణపర్తి శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు


గణపర్తి శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామ శ్మశాన వాటికలో బోరు సదుపాయం కల్పించారు. ఇంత వరకు గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడంతో శారదా నది పరీవాహక ప్రాంతంలో మృతదేహాలకు ఖననాలు జరిగేవి. దీంతో గ్రామానికి చెందిన మారిశెట్టి సత్యనారాయణ ముందుకొచ్చి గ్రామస్తులకు అవసరమయ్యే శ్మశాన వాటికకు సంబంధించి కొంత స్థలం కేటాయించారు. ఆ స్థలంలో ఇదే గ్రామానికి చెందిన స్వర్గీయ ఆడారి మహలక్ష్మి జ్ఞాపకార్థం మనుమళ్లు తమ వంతు సాయంగా బోరు ఏర్పాటుకు అయ్యే ఖర్చును భరించి శనివారం అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళాలు


గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. శనివారం మండలంలోని గవర్ల అనకాపల్లికి చెందిన దొడ్డి శివకుమార్, రోహిణి దంపతులు రూ.10,116 నగదును ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన దాడి నవీన్‌కుమార్, ఆశ దంపతులు రూ.5,116 నగదును విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.

పీహెచ్‌సీ పరిశీలన


వైద్యాధికారితో మాట్లాడుతున్న జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీ

పాయకరావుపేట : పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ఎం.ఎస్.వి.కె.బాలాజీ పరిశీలించారు. పీహెచ్‌సీలో ఉన్న ఫార్మసీ రికార్డులు, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీకి ప్రతిరోజూ వస్తున్న రోగుల సంఖ్య గురించి వైద్యాధికారి సౌందర్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పనితీరు ఎలా ఉందో ఆరా తీశారు. అనంతరం తగు సలహాలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ మూర్తి, వైద్య సిబ్బంది వున్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ప్రజలు


భారీ అన్న సమారాధన నిర్వహణ

కశింకోట : రిక్షా స్టాండ్ వద్ద వెలసిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని శనివారం ప్రజలు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా హనుమజ్జయంతి రోజు నిర్వహించాల్సిన అన్న సమారాధనను ఇప్పుడు భారీగా నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొల్లి రామంజి, ఇంటి ఈశ్వరరావు, కొల్లి సూరిబాబు, బి. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న దిమిలి పీహెచ్‌సీ సిబ్బంది

రాంబిల్లి : మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యురాలు బాల గంగా శ్రావణి సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా దోమ కాటు కారణంగా సంభవిస్తుందని పేర్కొన్నారు. నీటి నిల్వలు లేకుండా ప్రతి ఒక్కరూ చూసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు మలేరియా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రాజు, సీహెచ్‌వో వనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం


ఎ.భీమవరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: ప్రజలు సురక్షిత ఆరోగ్యాన్ని పొందేందుకు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఎ.భీమవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. 122 మందికి వైద్య పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా బి.పి, సుగర్ పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకునేందుకు ప్రజలు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డీఎస్ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం


రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పాత్రికేయులు

కోటవురట్ల : ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు రామోజీరావు మృతికి పాత్రికేయులు సంతాపం ప్రకటించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీనియర్ పాత్రికేయుడు డి.అప్పారావు మాట్లాడుతూ తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టించి ఎందరో పాత్రికేయులకు మార్గదర్శకులైన రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు అన్నారు. పాత్రికేయులు ఎ.ఈశ్వరరావు, ఎస్.కృష్ణ, నూకరాజు, కె.నాగు, గోవిందు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా శిథిల వంతెనలు


పెదగొలుగొండపేట, చిన గొలుగొండపేట మధ్య ఏలేరు కాలువపై శిథిలమైన వంతెన

నాతవరం: ఏలేరు కాలువపై నిర్మించిన వంతెనలు శిథిలం కావడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చిన గొలుగొండపేట, పెద గొలుగొండ మధ్యలో ఆర్ అండ్‌బీ రోడ్డుపై ఏలేరు కాలువపై వంతెన నిర్మించారు. ఇది శిథిలం కావడంతో వచ్చేపోయే ప్రయాణికులు భయపడుతున్నారు. ఇటీవల కొత్తగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురి కావడంతో మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 13 పంచాయతీల మీదుగా 25 కిలోమీటర్ల మేర పొడవున ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తోంది. కాలువ నిర్మాణ సమయంలో చాలాచోట్ల ప్రజలు రాకపోకలకు వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఏలేరు కాలువపై వంతెనలు నిర్మించారు. ఆయా వంతెనలు ప్రస్తుతం చాలాచోట్ల శిథిలమయ్యాయి. అవి ఏ సమయంలో కూలితాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. పెద గొలుగొండపేట, ఎ.శరభవరం, జిల్లేడుపూడి ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లపై ఏలేరు కాలువకు వంతెనలు నిర్మించారు. గునుపూడి, పి.కే.గూడెం, ఎ.పి.పురం, లింగంపేట, మన్యపురట్ల, కొండ ధర్మవరం ప్రాంతంలో రాకపోకలు సాగించేందుకు కాలువపై వంతెనలు నిర్మించారు. ఆయా వంతెనలపై పెద్ద వాహనాలు అధిక లోడుతో రాకపోకలు సాగించడంతో కుంగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రమాదకరంగా మారిన వంతెనలకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వసతులుంటేనే కాన్వెంట్లకు అనుమతి

ఎంఈవో–1 జానుప్రసాద్


బుచ్చింపేట కాన్వెంట్‌లో ఆరా తీస్తున్న సర్వే బృందం

రోలుగుంట: అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన కాన్వెంట్‌ల నిర్వహణకే అనుమతి ఉంటుందని, సర్వే చేసి వాటి నివేదికలు అందజేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మండలంలో కాన్వెంట్లపై మండల విద్యా శాఖ పర్యవేక్షణలో త్రీమెన్ కమిటీ శనివారం సర్వే చేపట్టింది. బుచ్చింపేట, కుసుర్లపూడి, జె.నాయుడుపాలెం, రోలుగుంటలో కాన్వెంట్లను శెట్టి మోహన్, కె.జగ్గారావు, ఎం.వెంకట్రావు బృందం సందర్శించింది. కాన్వెంట్‌లో రన్నింగు వాటర్, బెంచీలు, ఉపాధ్యాయుల స్టాఫ్ రూము, బాత్ రూములు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించింది. హెచ్‌ఎం జానుప్రసాద్ ఈ టీం సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే నివేదికను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందుజేస్తామని వివరించారు.

మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కృషి

దేవరాపల్లి: మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ఇ. పూజ్యమేఘన తెలిపారు. ఈ మేరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పూజ్యమేఘన మాట్లాడుతూ ఈ నెల ఒకటిన ప్రారంభమైన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని సాగిద్దామన్నారు. దీనికి ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సీహెచ్‌వో పి. ప్రసాదరావు, హెచ్‌వీ బి. లక్ష్మి, పీహెచ్‌ఎన్ బి. సునీత పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు



మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి 14వ వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు, కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామివారి పెళ్లిరాట కార్యక్రమంతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తామన్నారు. ఈ నెల 16వ తేదీన ఉదయం పుట్టమట్టి తీసుకురావడం, అంకురార్పణ, నవకలశ స్నపనం, నిజరూప దర్శనం, పూజా కార్యక్రమాలు జరుగుతాయని, 17వ తేదీ ఉదయం ఎదురు సన్నాహం, అనంతరం 9 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం నుంచి ఆలయ సమీపంలో అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయంలో భక్తిగీతాల ఆలాపన, అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఉంటుందన్నారు. 22వ తేదీ ఉదయం నుంచి వసంతోత్సవం, నాగవల్లి సంబరాలు, రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, పవలింపు సేవతో ఉత్సవాలు ముగిస్తాయని పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు ముందుగా రూ.2 వేలు కమిటీ వారికి చెల్లించాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు బియ్యం, లేదా ధన రూపంలో సమర్పించాలని కోరారు.

బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌కు అభినందన


బార్ అసోసియేషన్ స్టేట్ వైస్ చైర్మన్ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న సభ్యులు

నర్సీపట్నం: ఏపీ బార్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కె.కృష్ణమోహన్‌ను నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నర్సీపట్నం కోర్టు సముదాయంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కలిసిన వారులో సెక్రటరీ లోకా లోవరాజు, చింతల ప్రకాష్, సుర్ల నాయుడు ఉన్నారు.